ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఇసుక డిపోలు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
జిల్లాలో ఇసుక రీచులు లేవంటూ చిన్న తరహా వినియోగదారుల కోసం ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఇసుక డిపోలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు, నగరి, పలమనేరులో ఇసుక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సొంత రవాణా వాహనాలు , సొంత భూమి, లీజు భూమి ఒప్పంద పత్రాలు (కనీసం ఒక ఎకర) కలిగి నిల్వకేంద్రాలు ఏర్పాటు చేయాలనుకునే వారు వచ్చే ఏడాది జనవరి 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు చిత్తూరు నగరంలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని జిల్లా గనులు భూగర్భశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియకు సబంధించి ఫ్రీ బిడ్డింగ్ ప్రక్రియ జిల్లా గనులు భూగర్భశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం 7013886327 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పల్లె ప్రగతికి రూ.4.71 కోట్లు

- చిత్తూరులో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు
- మామిడి రైతు సంక్షేమం
- పాకాల రైల్వే డిపో ఏర్పాటు
- ఎంఎస్‌ఎంఈల ద్వారా యువత ఉజ్వల భవిష్యతు
- అభివృద్ధిలో ఎంపి మార్క్

చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ రావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పార్లమెంట్ ప్రజలు అభిమానం, అత్యధిక మెజార్టీతో చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం నుండీ విజయం సాధించారు దగ్గుమళ్ల ప్రసాద్‌రావు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము కానివ్వకుండా అంకితభావంతో తన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా గుర్తించిన సమస్యలకు పరిష్కారమార్గాన్ని చూపుతున్నారు. మంజూరైన 85 పనులకు గాను, ఇప్పటికే నాలుగు కోట్ల 71 లక్షల ఎంపీ నిధులను గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేటాయించారు. ఇందులో ముఖ్యంగా సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు, రహదారుల అనుసంధానం కోసం ఎంపీ నిధులను వెచ్చించారు. వీటిలో 36 పనులు పూర్తి కాగా, 49 నిర్మాణదశలో ఉన్నాయి.

మామిడి రైతు సంక్షేమం..

చిత్తూరు జిల్లా మామిడి పంటకి ప్రసిద్ధి. అయితే అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా తయారైంది మామిడి రైతుల పరిస్థితి. ఈ విషయాన్ని గుర్తించి మామిడి రైతుల కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తున్నారు ఎంపి. ఇందుకోసం చిత్తూరు పార్లమెంట్‌లో మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఎన్డీఏ సర్కార్కు పంపారు. ఇందుకు మోదీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. చిత్తూరు పార్లమెంటులో మ్యాంగో బోర్డును నెలకొల్పేందుకు సిద్ధమైంది.

కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు..

జిల్లా కేంద్రమైన చిత్తూరులో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలనే దృఢ సంకల్పంతో ప్రయత్నాలు చేస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజల విజ్ఞప్తి మేరకు జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వంతో కూడా సంప్రదింపులు జరిపారు. విశ్వవిద్యాలయాన్ని సాధించేందుకు తన వంతు కృషి చేస్తున్నారు.

పాకాలలో రైల్వే కోచ్ డిపో ఏర్పాటు..

ప్రజల చిరకాల స్వప్నమైన పాకాల రైల్వేకోచ్ డిపోను నెలకొల్పడం ద్వారా దీనికి చెక్ పెట్టవచ్చని భావించారు. అదేవిధంగా చిత్తూరు పార్లమెంటు రూపు రేఖలను మార్చవచ్చునని తలచారు. అనుకున్నదే తడవుగా ఎమ్మెల్యేలు, జిల్లా అధికారుల సహకారంతో పాకాలలో రైల్వే కోచ్ డిపోను నిర్మించేందుకు కావలసిన ప్రతిపాదనలను సిద్ధం చేయించి కేంద్ర ప్రభుత్వానికి పంపారు. తక్షణం స్పందించిన కేంద్ర రైల్వే శాఖ పాకాలలో రైల్వే కోచ్ డిపోను నిర్మించేందుకు పచ్చజెండా ఊపింది. 2025 మార్చిలో పాకాల రైల్వేస్టేషన్లో రైల్వే కోచ్ డిపో నిర్మాణపు పనులను చేపట్టాలని ఆదేశిస్తూ సంబంధిత శాఖకు ఉత్తరం కూడా రాసింది. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చొరవతో.. నిర్మాణం పనులు త్వరలోనే కార్యరూపం దాల్చనున్నాయి. దీంతో జిల్లా వాసుల కల సాకారం కానుంది. నిరుద్యోగ సమస్య కూడా పరిష్కారం లభించనుంది. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం రూపురేఖలు మారనున్నాయి. అలాగే జిల్లా కేంద్రమైన చిత్తూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గతంలో మందకుండిగా జరిగిన చిత్తూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు ఎంపీ ఆదేశాలతో ఊపందుకున్నాయి. అంతేకాకుండా ఈ పనులన్నీ పూర్తి అయిన వెంటనే చిత్తూరు రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే పలు ఎక్స్ప్రెస్ రైళ్లన్నీ జిల్లా కేంద్రమైన చిత్తూరు రైల్వే స్టేషన్‌లో ఆపాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఎంఎస్‌ఎంఈలతో యువతకు ఉపాధి

ఎంఎస్‌ఎంఈల పై ప్రత్యేక దృష్టి సారించారు. దీని పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందాన్ని జిల్లా కేంద్రమైన చిత్తూరుకు రప్పించారు. చిత్తూరు కలెక్టరేట్లో సమావేశం నిర్వహించి ఎంఎస్‌ఎంఈల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అందించే నిధుల ద్వారా చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని యువత స్వయం కృషితో ఎదగాలని సూచించింది. చిత్తూరు రూరల్ దిగువమాస పల్లె అండ్ బ్రిడ్జి, జీడి నెల్లూరు, చిన్న వెపంజేరి రెవెన్యూ శెట్టిఫారం గ్రామాలకు సంబంధించి అండర్ బ్రిడ్జ్ నిర్మాణాలకు ఎంపి చూపిన చొరవ కారణంగా ఆ ప్రాంత ప్రజల కష్టాలు తీరనున్నాయి.

ఉపాధ్యాయులపై ఒత్తిడి

ప్రభుత్వబడుల్లోని విద్యార్థులకు నష్టం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాజ్యాంగంలో ఆదేశ సూత్రాలలో 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు ఉచిత ప్రాథమిక నిర్బంధ విద్య అందించాలని చెప్పిన దానికి భిన్నంగా 2009లో వచ్చిన విద్యాహక్కు చట్టాన్ని సవరించి ఐదు, ఎనిమిది తరగతుల పిల్లలకు డిటేల్స్ విధానం ప్రవేశపెట్టడానికి యుటిఎఫ్ రాష్ట్ర కమిటీగా వ్యతిరేకిస్తున్నామని, డిటెన్షన్ విధానం వల్ల పేదపిల్లల విద్యకు దూరం అవుతారని రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎం.సోమశేఖర్ నాయుడు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ విద్య సామాజిక అంతరాలను తగ్గించాలని, దానికి భిన్నంగా డిటెన్షన్ విధానం పేదవారిని విద్యకు దూరం చేసి, మరింత అంతరాలను పెంచడానికి దోహదపడుతుందని విమర్శించారు. జాతీయ విద్యా విధానం–2020 లో భాగంగా ఇలాంటి అశాస్త్రీయ విధానం కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం సరికాదని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఉండే విద్యార్థులను దష్టిలో పెట్టుకుని డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. 5,8 తరగతులను డిటెన్షన్ అయిన విద్యార్థులు చదువులు కొనసాగించడం అసాధ్యమని తెలిపారు. ఎన్ఈపి 2020ని యధాతథంగా రాష్ట్రాలు అమలు చేయడం వల్ల స్థానికతకు ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపారు. ఎన్ఈపి 2020ని రద్దు చేయాలని డిమాండ్ ఉన్న సమయంలో కేంద్రం ఈ గెజిట్‌ను తీసుకురావడాన్ని వ్యతిరేకించారు. విద్య కార్పోరేటీకరణ కాకుండా, ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిటెన్షన్ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేయకుండా నాన్ డిటెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలను రక్షించుకునే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించి, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మణి గండన్ మాట్లాడుతూ కాకినాడలో జనవరి 5,6,7,8 తేదీలలో జరిగే మహాసభలను జిల్లా నుంచి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పి.సుధాకర్ రెడ్డి, కే.రెడ్డప్ప నాయుడు, ఎస్.రెహానా బేగం, కే.ప్రసన్నకుమార్, టి.రఘుపతి రెడ్డి, కే.దీనావతి, ఎస్పీ బాషా, పిఆర్.మునిరత్నం, సిపి.ప్రకాష్, ఏ.కృష్ణమూర్తి, గాలి సురేష్, టి.దక్షిణా మూర్తి, కే.సరిత, డి.ఏకాంబరం, బి.ఈశ్వర మహేంద్ర, పి. సురేష్, గణేష్ కుమార్, ఎంవి.రమణ, పిసి.బాబు, టి.బాలాజీ, బివిజరమణ, వంశీకృష్ణ, ఎంసీ నిర్మల పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధి సాధనలో బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తాయి: కలెక్టర్

ప్రైవేట్ బ్యాంకులు

ఆలోచన సరళిని మార్చుకోవాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలకు ప్రైవేటు బ్యాంకులైన హెచ్‌డిఎఫ్‌సి, కోటక్, ఐసిఐసి ఇతరత్రా బ్యాంకులు కేటాయించిన లక్ష్యాలను ఎందుకు పూర్తి చేయడం లేదంటూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బ్యాంకర్లను ప్రశ్నించారు. జిల్లా సమగ్ర అభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకమని ఈ దిశగా బ్యాంకర్లు పనిచేయాలని సూచించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపుమందిరంలో డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశం లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక రంగమైన వ్యవసాయ రంగంలో రైతులకు పంట పెట్టుబడిగా అవసరమైన పంట రుణాలు, షార్ట్‌టర్మ్ క్రాప్ ప్రొడక్షన్ రుణాల మంజూరులో ప్రతి బ్యాంకుకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయడంలో ప్రైవేటు బ్యాంకులు అనాసక్తి చూపుతున్నాయని ఆర్థిక అభివృద్ధిలో బ్యాంకుల భాగస్వామ్యం ఎంతో అవసరమనన్నారు. పంట పెట్టుబడి సాయం కోసం రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు శ్రద్ధ చూపాలని సూచించారు. జిల్లా వ్యవసాయ, పారిశ్రామిక ఆర్థికంగా అభివృద్ధి చెందడంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల ద్వారా మేలు జరిగేలా అర్హులైన లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేయాలనన్నారు. 2024–25 వార్షిక రుణప్రణాళికలో భాగంగా ప్రాధాన్యతా రంగాలకు 30 సెప్టెంబర్ వరకు రూ.6,699 కోట్లు రుణాలు లక్ష్యంగా నిర్దేశించగా రూ.7,654కోట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 30 వరకు బ్యాంకుల ద్వారా వ్యవసాయ రంగానికి రూ.5488 కోట్లు లక్ష్యం కాగా రూ.6,284 కోట్లు పంపిణీ చేశామని, ఇందులో స్వల్పకాళిక పంట రుణాల కింద రూ.3,451 కోట్లు రుణాలు లక్ష్యం కాగా రూ.4,437 కోట్లు, వ్యవసాయ, అనుబంధ రంగాల కింద రూ.1,642 కోట్లు లక్ష్యం నిర్దేశించగా రూ.1,547 కోట్లు పంపిణీ చేశామన్నారు. వీటితో పాటు మైక్రో, స్మాల్ ఎంటర్ప్రైజెస్‌కు సంబంధించి రూ.915 కోట్లు లక్ష్యానికి గానూ రూ.1,105 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.295 కోట్లు లక్ష్యానికి గానూ రూ.256 కోట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగంతో పాటు పశు పోషణ, డైరీ, చేపల పెంపకం, తేనె తీగల పెంపకానికి సంబంధించి కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా రైతులకు రూ.3లక్షల వరకు రుణాలను అందించడం జరుగుతుందన్నారు. రుణాలను సకాలంలో తిరిగి చెల్లించిన రైతులకు సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. బ్యాంక్ లింకేజీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాలలో 6,390 గ్రూప్‌లకు రూ.472 కోట్లు, పట్టణ ప్రాంతాలలో 1,305 గ్రూప్‌లకు రూ.214 కోట్లు పంపిణీ చేశామన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, నాబార్డ్ ఏజిఎం సునీల్, ఎల్‌డిఎం హరీష్, డిసిసిబి సిఈఓ మనోహర్ గౌడ్, జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చెరువు కట్ట తెగిన ప్రాంతంలో తాత్కాలిక పనులు

జెసిబి సాయంతో తాత్కాలిక రోడ్డు నిర్మాణం చేస్తున్న ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం పొదలకుంటపల్లి పంచాయతీ నంజంపేట తుగడంవారిపల్లి మార్గమధ్యంలోని దళవాయి చెరువుకు ఈనెల నాలుగవ తేదీ తూము వద్ద గండి పడింది. ఆ తరువాత కట్ట పది మీటర్ల వెడల్పుగా కొట్టుకుపోయింది. దీంతో పొదలకుంటపల్లి నంజంపేట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పాఠశాల విద్యార్థులు ప్రజలు వచ్చి పోయే అవకాశం లేకపోవడంతో తెగిన ప్రాంతంలో నీటి ప్రవాహంలోనే ధైర్యం చేసి రాకపోకలు సాగిస్తూ వచ్చారు. గ్రామంలో మంగళవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, ఇరిగేషన్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణం కోసం భారీ నల్ల రాళ్ల కట్ట తెగిన ప్రాంతంలో తొలి జెసిబి ద్వారా పనులు ప్రారంభించారు. నీటి ప్రవాహం పూర్తిస్థాయిలో తగ్గగానే పైపులు ఏర్పాటు చేసి కట్ట నిర్మాణాన్ని పూర్తి చేసి రాకపోకలు జరిగే విధంగా చేస్తున్నట్లు తెలిపారు.

సభలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ

మోసపూరిత ప్రచారాలతో

అప్రమత్తంగా ఉండాలి: అసిస్టెంట్ కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వినియోగదారులు మోసపూరిత ప్రచారాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, వివిధ మాధ్యమాల ద్వారా వచ్చే వ్యాపార ప్రకటనలను విశ్లేషించుకోవాలని నిర్ణయం తీసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కలెక్టర్ పాల్గొని విద్యార్థులకు వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం కోసం 24 డిసెంబర్ 1986 సంవత్సరంలో మొట్టమొదటి సారిగా వినియోగదారుల రక్షణ చట్టం కార్యరూపందాల్చిందని, ఈ చట్టం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వినియోగదారులు ఈ – కామర్స్, డిజిటల్ వర్తకం పై ఎక్కువ మక్కువ చూపుతున్నారని, డిజిటల్ లావాదేవీల సమయంలో జాగ్రత్త అవసరమన్నారు. ఆన్‌లైన్ కొనుగోలు సమయంలో గుర్తింపు పొందిన వెబ్‌సైట్ల ద్వారా కొనుగోలు చేసుకోవడం మంచిదని, నగదు చెల్లింపు పేజీలు సురక్షితంగా ఉన్నాయా అన్ని విషయాన్ని సరిచూసుకోవాలన్నారు. ఉచిత బహుమతులు, డిస్కౌంట్ సేల్స్ వలలో పడొద్దని, ఖరీదైన వస్తువులను ఆన్‌లైన్లో కొనే సమయంలో క్యాష్ ఆన్ డెలివెరి ఆప్షన్ ఎంచుకోవడం మంచిదన్నారు. అనవసరమైన లింకులు, అటాచ్మెంట్లు, యాప్‌లకు దూరంగా ఉండాలని, స్కామర్ల నుండి రక్షణ పొందేందుకు ప్రొటెక్టింగ్ సాఫ్ట్ వేర్లను ఇన్స్టాల్ చేసుకోవాలన్నారు. బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్ నెంబర్, సివివి నెంబర్, పాస్ వర్డ్ లాంటి వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దన్నారు. కార్యక్రమానికి డిఎస్ఓ శంకరన్, వినియోగదారుల కమిషన్, చిత్తూరు మెంబర్ సలీం, పివికెఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవన జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది..

- కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్

వికలాంగులకు ఉపకరణాలను అందిస్తున్న కడా పీడీ

ప్రజాశక్తి - రామకుప్పం: విభిన్న ప్రతిభావంతులకు సహాయక ఉపకరణాలు అందించి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టడమైనదని, తద్వారా జీవితంలో వారు మరింత ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉందని కడా పీడీ వికాస్ మర్మత్, కుప్పం ఆర్డీఓ శ్రీనివాస రాజు పేర్కొన్నారు. రామకుప్పంలో జరిగిన ప్రత్యేక గుర్తింపు శిబిరంకు 734 హాజరు కాగా 680 మంది అర్హత సాధించారని విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వై.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కుప్పం నియోజకవర్గం రామకుప్పంలోని జెడ్పి హైస్కూల్‌లో రామకుప్పం, శాంతిపురం మండలాలకు సంబంధించి అలిమ్కో సంస్థ ద్వారా వృద్ధులు, వికలాంగుల సహాయార్థం పరికరాలకు ప్రత్యేక గుర్తింపు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కడా పిడి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శిబిరాన్ని నిర్వహించడం జరుగుతున్నదని, రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన వృద్ధులు, వికలాంగులు శిబిరాలకు చేరుకోవడానికి ప్రభుత్వం తరపున ఆటోలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిష్ణాతులైన డాక్టర్ల ద్వారా దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను గుర్తించడం జరుగుతున్నదని, సహాయ ఉపకరణాలు దాదాపు 45రోజులలో లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని అన్నారు. సదరం క్యాంప్‌లు కూడా త్వరలో నిర్వహించడం జరుగుతుందని, వికలాంగుల ధృవీకరణ పత్రాలు పంపిణీ చేసి పెన్షన్ అందించే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్, టిడిపి మండల కన్వీనర్ ఆనంద్ రెడ్డి, ఆంజనేయ రెడ్డి, చిన్ని క్రిష్ణ, చలపతి, సీతాపతి, సుబ్రీ, బాలు, అవినాష్, మురళి, హరీష్ పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తే ప్రాణాలు తీస్తారా..

డీఎస్పీకి ఫిర్యాదు

ప్రజాశక్తి- కుప్పం టౌన్

పోలీసు అధికారులపై ఫిర్యాదు చేస్తే ప్రాణాలు తీస్తారా అంటూ కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం అబకళదొడ్డి గ్రామానికి చెందిన సురేష్ ప్రశ్నించారు. రాళ్ళబుదుగురు ఎస్ఐపై బాధితుడు కుప్పం డిఎస్పి పార్థసారధికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గత కొద్ది రోజులకు ముందు తాను ద్విచక్ర వాహనంపై గ్యాస్ సిలిండర్ తీసుకొని వెళు తూ రోడ్డు పక్కన ఆపి ఉండగా అటు వైపు వెళ్లిన ఒక సుమో వాహనం తన కాలిపై దూసుకెళ్లడం జరిగిందని, వాహనాన్ని వెంబడించగా వాహనంలో బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈవిషయాన్ని వెంటనే రాళ్ళబుదుగురు ఎస్సైకి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామని, అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విచారించగా ఎస్సై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇది నీకు సంబంధంలేని విషయం, ఇకపై ఈ విషయమై మాట్లాడకు అంటూ దురుసుగా సమాధానం ఇచ్చినట్టు తెలిపారు. ఎస్సై వ్యవహారంపై నిరుత్సాహం చెంది సమాచారాన్ని ఎస్పీకి చేరవేస్తూ, ఎస్సైపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకున్న ఎస్సై మంగళవారం రాళ్ళబుదుగురు పోలీస్‌స్టేషన్ ఆవరణలో తనను గమనించి, దుర్భసలాడుతూ తనపై విరుచుకుపడ్డట్టు ఆరోపించారు. పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో కనిపిస్తే కాల్చి పారేస్తానంటూ బెదిరించడం జరిగిందని, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, తప్పును ప్రశ్నిస్తూ ఫిర్యాదు చేసిన తనను చంపుతానని బెదిరించడంపై డీఎస్పీకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అంతేకాక తన ప్రాణానికి రాళ్ళబుదుగురు ఎస్సై వల్ల హాని ఉందని తెలిపారు.

పాత్రికేయులతో మాట్లాడుతున్న బాధితుడు సురేష్

డిపాజిట్లపై అధిక వడ్డీ

రైతు రుణాలకు తక్కువ వడ్డీ : మేనేజర్ రాధారాణి

ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్

ప్రజాశక్తి- పుంగనూరు : జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో డిపాజిట్లు చేసేవారికి అన్ని బ్యాంకులు కన్నా అధిక వడ్డీ, రైతులకు పంట రుణాలపై తక్కువ వడ్డీతో ఇవ్వడం జరుగుతుందని పుంగనూరు బ్రాంచ్ మేనేజర్ పి.రాధారాణి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం బ్యాంకు ఖాతాదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. డిపాజిట్ సేకరణ ఆంధ్రప్రదేశ్ సహకార కేంద్ర బ్యాంక్ ఉద్యోగస్తుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి ఆదేశాలతో చిత్తూరు యూనిట్ అధ్యక్షులు రఘుబాబు, జిల్లా కార్యదర్శి గంగిరెడ్డి ఆదేశాల మేరకు 23, 24, 28 తేదీల్లో అన్ని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచ్ ద్వారా తెల్లవారి 9 నుండి 10 గంటల వరకు సాయంత్రం ఐదు నుండి ఒక గంట సేపు డిపాజిట్లు సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. యూనియన్ సభ్యులు పాల్గొని బ్యాంక్ అభివృద్ధి కోసం సహకరించాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డప్ప కోరారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో ఇతర బ్యాంకుల కంటే డిపాజిట్లపై అధిక వడ్డీ రైతులకు పంట రుణాలపై తక్కువ వడ్డీతో రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. అదేవిధంగా బంగారం పైన, హౌసింగ్, మహిళలు, డ్వాక్రా రుణాలపైన రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు సిబ్బంది, సూపర్వైజర్ శ్రీకాంత్, శీను, సిబ్బంది శ్రీవిద్యా, ఆశయ, అమృత, రవికుమార్, పార్వతి పాల్గొన్నారు.

విక్రయానికి పాత వస్తువులు

ద్రావిడ వర్శిటీ వీసీ

ప్రజాశక్తి- కుప్పంటౌన్: ద్రావిడ విశ్వవిద్యాలయంలోని పనికిరాని పాత వస్తువులను అమ్మకానికి నిర్ణయించినట్టు విశ్వవిద్యాలయ కుల సచివులు కిరణ్ కుమార్ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. పాత వస్తువుల కొనుగోలుదార్లు స్వయంగా విశ్వవిద్యాలయాన్ని సంప్రదించి, పనికిరాని పాత వస్తువులను పరిశీలించి, కొనుగోలు చేయదలచిన వారు కోరారు. విశ్వవిద్యాలయ నమూనా కొటేషన్‌లో లిఖితపూర్వకంగా ధరలను నింపి సీల్డ్ కవర్ ద్వారా టెండర్ వేయాలని సూచించారు. కొనుగోలుదారులు వారి టెండర్లను ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలలోపు రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించవచ్చునని తెలిపారు.

డ్వాక్రా సంఘాలకు

రూ.10.20 కోట్ల రుణాలు

ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: స్వయం సహాయక సంఘాలకు 10 కోట్ల 20 లక్షల రూపాయల రుణాలను మంజూరు చేసినట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం మండల కార్యాలయంలో ఏపిఎం రవి ఆధ్వర్యంలో బ్యాంక్ లింక్ జేజీ రుణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 45 స్వయం సహాయక సంఘాలకు 10 కోట్ల 20 లక్షల రూపాయలను బ్యాంకు లింకేజీ రుణాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ డ్వాక్రా రుణాలు 8 కోట్ల 60 లక్షల రూపాయలు, మిగతా ఒక కోటి 60 లక్షల రూపాయలు ప్రేమ్‌సిడ్ స్కిన్ కింద డ్వాక్రా మహిళలకు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుండి బ్యాంకుల ద్వారా అందిస్తున్న ఈ రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీధర్, ఏపీఎం రవి, బ్యాంకు మేనేజర్ సురేంద్రబాబు, టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు, సీసీలు ఆశా, ప్రభావతి, హైమావతి, శిరీష, సుధాకర్, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ఐబిఎం వారిచే శిక్షణ తరగతులు

ప్రజాశక్తి- గంగవరం : మండలంలోని మదర్‌థెరిసా విద్యాసంస్థలలో బీటెక్ చదువుతున్న రెండు, మూడు సంవత్సరాల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో ఈడియు నీట్ వారు ఐబిఎం కంపెనీ వారి మంగళవారం నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్‌బిల్డ్ అనే అంశంపై వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ కోర్సులు ఎలా నిర్వహించాలి, సర్టిఫికెట్ కోర్సులు ఎలా పూర్తి చేయాలన్న అంశంపై విద్యార్థులకు అవగాహన కలిగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ విజయానంద్ కళాశాల చైర్మన్ సునీల్, అకాడమీ అధికారి రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు ఘనసన్మానం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం చెక్కునత్తం గ్రామానికి చెందిన అగ్రికల్చర్ అసిస్టెంట్ బాలరాజు నాయక్‌కు తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మణి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ తమ గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఏకంగా పదోన్నతి పొంది రామకుప్పం బదిలీ కావడం ఆనందంగా ఉందన్నారు. తమ గ్రామ సచివాలయ పరిధిలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా ఆయన రైతులకు అందించిన సేవలు మరువలేమని కొనియాడారు. నాయకులు కనకరాజు, మునిరత్నం, తిమ్మప్ప, వీరప్ప, రాము, నాగరాజు పాల్గొన్నారు.

27న కరెంట్ ఛార్జీల భారంపై నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కూటమి ప్రభుత్వం కరెంటు ఛార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 27వ తేదీన ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్నట్లు వైసిపి చిత్తూరు నియోజకవర్గం ఇంచార్జ్ ఎంసి విజయనంద రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ పోస్టర్లు ఆవిష్కరించారు. స్థానిక కట్టమంచి గంగినేని చెరువు నుండి గాంధీ రోడ్‌లోని ఎస్పీడీసీఎల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. గాయత్రీ దేవి, కృష్ణారెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం: తహాశీల్దార్

ప్రజాశక్తి - కార్వేటినగరం : రైతుల శ్రేయ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మండల తహాశీల్దార్ కొమ్ము నాగరాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్కేవిబి పేట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల సమస్యలను పరిష్కారం కోసమే ఈ రెవెన్యూ సదస్సు అని తెలిపారు. అనంతరం టిడిపి నాయకులు ఢిల్లీ బాబు రెడ్డి, హేమంత్ రెడ్డి, చెంగల్రాయులు తహసీల్దార్, మండల సర్వేయారు బాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దివ్య, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం వినియోగదారులు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వాణిజ్యశాఖ, ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో కళాశాల ఐక్యూఏసీ వారు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, ఉపన్యాసకులు డాక్టర్ కె.పాండ్యరాజ్ విద్యార్థులకు వినియోగదారుల చట్టం గురించి అవగాహన కల్పించారు. డాక్టర్ సి.మంగళ గౌరి, డాక్టర్ పుడి వెంకటేశు వినియోగదారుల ఫోరమ్స్, ఆన్‌లైన్ ద్వారా ఎలా ఫిర్యాదు చేయాలనే అంశాలపై వివరించారు.

బాలికల అభివృద్ధికి కృషి : ఈఓపిఆర్‌డి

ప్రజాశక్తి- వెదురుకుప్పం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కిషోర్ వికాసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ శకుంతల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డి పురుషోత్తం మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల కిశోర్ బాలికల ఆరోగ్యం, పోషణ, విద్య, లింగ వివక్ష, అక్రమ రవాణా, బాల్య వివాహంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తల సహకారంతో బాల్య వివాహాలను నిర్మూలించాలని, బాలికల అభివృద్ధికి నడుం బిగిద్దమని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ఐసిడిఎస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కరెంట్ ఛార్జీలపై వైసిపి పోరుబాట

ప్రజాశక్తి- వెదురుకుప్పం/ గంగాధర నెల్లూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలపై కరెంటు చార్జీల భారం పెంచారని ఈ బాదుడుపై నిరసన కార్యక్రమంకు సంబంధించిన వాల్ పోస్టర్ నియోజకవర్గ ఇన్చార్జి కృపాలక్ష్మి మంగళవారం ఆవిష్కరించారు. ఈనెల 27వ తేదీ అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో విద్యుత్ శాఖ అధికారుల కార్యాలయం వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లి కరెంటు చార్జీలు తగ్గించాలని వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. వైసిపి నియోజకవర్గ ఆరు మండలాల కన్వీనర్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు ఎంపిటీసీలు పాల్గొన్నారు.

గుండిగల్లులో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని గుంతకల్లు పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారిని హేమలత తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుల భూమి మట్టి పరీక్షలు చేసి, భూములకు వాడవలసిన ఎరువులు, కషాయాలను గురించి వివరించారు. అలాగే ప్రభుత్వం రైతులకు కేటాయించిన పథకాల గురించి, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బిందు సేద్యం గురించి తెలియజేశారు. అలాగే సబ్సిడీ ధరలో పరికరాలు లభిస్తాయని రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకుంటే నష్టపోయిన రైతులకు ప్రభుత్వం కేటాయించిన ధర చెల్లిస్తుందని తెలిపారు.

ప్రేమ, కరుణ, శాంతికి ప్రతిరూపం క్రిస్మస్

జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, చిత్తూరు టౌన్: సంతోషంగా ఉండటమే క్రిస్మస్‌కు గుర్తు అని, ప్రతి ఒక్కరు క్రీస్తు తత్వాన్ని అనుసరించాలని, ప్రేమను పంచి, పగను తుంచాలని క్రీస్తు సూక్తిని పాటించాలని చిత్తూరు జిల్లా ఇన్చార్జ్ మంత్రి రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజలకు, క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వం మైనార్టీలకు రూ. 5 కోట్ల ఖర్చు చేస్తే తమ ప్రభుత్వ హయాంలో రూ. 70 కోట్ల ఖర్చు చేశామన్నారు. మైనార్టీలు, క్రిస్టియన్స్ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. క్రైస్తవుల ఆర్థికాభివృద్ధికి స్వయం ఉపాధి రుణాలు అందించిన, అందిస్తున్న ఏకైక ప్రభుత్వం చంద్రబాబు ప్రభుత్వమేనని అన్నారు. అలాగే జిల్లాలోని క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, ఎంఎల్‌సి శ్రీకాంత్, చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్‌మోహన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డిఆర్ఓ కె.మోహన్ కుమార్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించి వారిని అదుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని చిత్తూరు నగరపాలక సంస్థ మేయర్ అముద అన్నారు. మెప్మా సహకారంతో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో క్రిస్మస్ ముందస్తు సంబరాల్లో భాగంగా కేక్ కట్ చేసి దుప్పట్లు పంపిణీ ఆ సంస్థ అధ్యక్షుడు జోసెఫ్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఈఎంసి ఫౌండేషన్ అధినేత ఎడ్వర్డ్ అందిస్తున్న సేవలను మేయర్ అభినందంచారు. కార్యక్రమంలో సపోర్ట్ సంస్థ సిబ్బంది ప్రమీల, శశిరేఖ, శ్రీనివాస్, సెల్వి 50మంది నిరాశ్రయులు పాల్గొన్నారు.

విజయం విద్యాసంస్థలో..

నగరంలోని సుందరరాజపురం విజయం విద్యాసంస్థల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి మాట్లాడుతూ శాంతి, ప్రేమ, దయ, మార్గంలో ప్రతి ఒక్కరు నడుచు కోవాలని ఈర్ష ద్వేషాలను మరిచి శాంతి, సౌభ్రాతత్వంతో మెలగాలని అన్నారు. ఈ సందర్భంగా పిల్లలు క్రైస్తవ సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు.

బృందావనం స్కూల్లో..

బృందావనం స్కూల్ వ్యవస్థాపకులు శైలజ కుమారి ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు క్రైస్తవ బైబిల్ పఠనం, పాటలు, వేషధారణలతో విద్యార్థులు ప్రదర్శనలు ఆకర్షణీయంగా నిలిచాయి.

కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో..

బిసిఎన్ విద్యాసంస్థలలో భాగమైన కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత బిసి.నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల ఆవరణలో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, శాంతాక్లాస్ వేషధారణలో ప్రత్యేక నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షులు డాక్టర్ సునీల్‌రాజ్, సీఈఓ సాగర్‌రాజ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలంకరణలో తూగుండ్రం సిఎస్ఐ చర్చి

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం దళితవాడలోని సిఎస్ఐ చర్చి విద్యుత్ దీపాలతో అలంకరించారు. పాస్టేట్ రెవడెంట్ జాన్ నవీన్ మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా చర్చిని విద్యుత్ కాంతులతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి: సిఐ

ప్రజాశక్తి- రొంపిచర్ల: పీలేరు- చిత్తూరు మార్గంలోని రహదారిలో పులిచెర్ల మండలం కల్లూరు సబ్ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనాలలో వెళ్ళవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ వల్ల ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చునని దాని ఉపయోగం గురించి వివరించారు. అందరూ విధిగా హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలని హెచ్చరించారు.

మోటమర్రిలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి- రొంపిచర్ల: రొంపిచర్ల మండలం మోటమర్రి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు తహాశీల్దార్ పి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామప్రజలకు భూమికి సంబంధించిన ఎలాంటి సమస్యలున్నా ఆఫీసుల చుట్టూ తిరిగే పనిలేకుండా రెవెన్యూ సదస్సులో తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్ఎస్‌డిటి లోకేష్, ఆర్ఐ సుధాకర్ నాయక్, వీఆర్వో, సర్వేయర్లు పాల్గొన్నారు.

31 వరకు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- కుప్పంటౌన్: పిఇఎస్ ఆసుపత్రిలో నిర్వహించనున్న ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర సుబ్రమణ్యం మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు పిఈఎస్ ఆసుపత్రిలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాధారణ వైద్యం, చిన్నపిల్లల సమస్యలు, జనరల్ సర్జరీ, ఎముకలు, కీళ్ళ, ప్రసూతి, స్త్రీ గర్భకోశ విభాగాల సమస్యలు వంటి వివిధ వ్యాధులకు ఆసుపత్రిలో చేరిన వారికి రక్త, మూత్ర పరీక్షలు, ఎక్స్-రే, స్కానింగ్, చెక్కర పరీక్ష, డెలివరీ చార్జీలు, అన్ని ఆపరేషన్ చార్జీలు పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేసారు. ఆర్థిక స్థోమత లేనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ ధర్మకర్త పై ఫిర్యాదు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని వరత్తూరు పంచాయతీ కాలేపల్లిలో ధర్మరాజులు గుడి ఉంది. ఈ గుడికి ధర్మకర్తగా కోదండరెడ్డి వ్యవహరిస్తున్నారు. మంగళవారం రెవెన్యూ సదస్సులో గుడి ధర్మకర్తపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గుడిమాన్యంకు చెందిన 5 ఎకరాల భూమిని ధర్మకర్త పేరుపై ఎలా మార్పిడి చేస్తారని తహశీల్దార్ చంద్రశేఖర్‌ను కోరారు.

28న దుకాణాల వేలం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి గ్రామంలో శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన వివిధ దుకాణాలకు ఈనెల 28న శనివారం ఉదయం 11 గంటలకు లీజు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మునిరాజు, వంశ పారంపర్య ధర్మకర్త విజయకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో వాహనాల పార్కింగ్, కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయం, పాదరక్షలు భద్రపరచుట, కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కు, తలనీలాల సేకరణకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తలనీలాల సేకరణకు సంబంధించి రూ.50వేలు, మిగిలిన వాటికి సంబంధించి రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలియజేశారు. ఇతర వివరాలకు ఆలయ కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక ప్రతిభావంతుల ర్యాలీ

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా పలమనేరు ఆశాజ్యోతి వికలాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించా. ఈ సందర్భంగా వికలాంగుల స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల నాగేంద్ర మాట్లాడుతూ వికలాంగులకు మూడు పర్సెంట్ ఉన్న రిజర్వేషన్లు 10శాతం పెంచాలన్నారు. పింఛన్ రూ.6వేలు చేసిన సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సిఎంను కలిసిన సప్తగిరి ప్రసాద్

ప్రజాశక్తి- తవణంపల్లి: టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. పూతలపట్టు నియోజకవర్గానికి ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద కనీసం 25వేల ఇల్లు మంజూరు చేయాలి, ప్రతి పేదవాడికి ఇంటి పథకం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తిరుపతి టు రామేశ్వరం వెళ్లే రామేశ్వరం ఎక్స్ప్రెస్ ట్రైన్‌ను చిత్తూరులో స్టాపింగ్ ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రికి లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పూతలపట్టులోని ప్రాథమిక వైద్యానికి కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు బంగారుపాల్యంలో ఉన్న డయాలసిస్ సెంటర్లో డయాలసిస్ మిషన్లను 20కి పెంచాలని కోరారు. ఆయన వెంట బంగారుపాళ్యం మండలం మొగిలి మాజీ సర్పంచ్ మంజునాథ్ ఉన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్

శరవేగంగా సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు

- సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ ఆనంద్

ప్రజాశక్తి- సోమల: సోమల మండలంలో కోటి 20 లక్షల రూపాయల నిధులతో గ్రామీణ ప్రాంతాలలో సిమెంటు రోడ్ల నిర్మాణాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి లోపు పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ ఏఈ ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 32 సిమెంటు రోడ్ల నిర్మాణానికి అనుమతులు వచ్చాయని, వీటిలో ఇప్పటికే 11 పూర్తి చేశామని మరో 10 పనులు జరుగుతున్నాయని తెలిపారు. మొత్తం కోటి 20 లక్షల రూపాయల నిధులు సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఖర్చు చేస్తున్నామని, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సిసి రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. నాణ్యతలో రాజీ లేకుండా సిమెంట్ రోడ్డు నిర్మాణానంతరం క్యూరింగ్ కూడా 22 రోజులపాటు పూర్తిగా జరిగే విధంగా చూస్తున్నామని పరిశీలన కోసం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పర్యవేక్షిస్తున్నారని ఆయన తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ మణికంఠ, సచివాలయ సిబ్బంది మదనిక తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో మండలంలోని నల్లరాళ్లపల్లి లేఔట్స్‌ను పరిశీలించి అక్కడి లబ్ధిదారులతో మాట్లాడారు. పెండింగ్ ఇంటి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేస్తే సకాలంలో బిల్లులు చెల్లిస్తామన్నారు. అనంతరం ఇంటి నిర్మాణాలు, తాగునీటి ఎద్దడి, పరిశుభ్రత తదితర అంశాలపై ఆరా తీశారు. జీడి నెల్లూరు పంచాయతీ పరిధిలోని నల్లారపల్లి హౌసింగ్ లేఔట్ వద్ద నిర్మిస్తున్న ప్రభుత్వ గృహ నిర్మాణ పనులను పరిశీలించారు నిర్మాణాలకు వినియోగిస్తున్న మెటీరియల్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణాలలో నాణ్యమైన మెటీరియల్ వాడాలని సూచించారు. మండల పరిధిలోని కోటగారం, దళితవాడలకు తాగునీరు సరఫరా చేతిబోరు వర్షాలకు నీటిలో మునిగిపోయిందని గ్రామస్తులు ఎంపీడీవోకు విన్నవించారు. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్లపై పంచాయతీ కార్యదర్శి శివయ్యతో చర్చించి తాగునీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు తెలిపారు. మండల పరిధిలోని వేపంజేరి గ్రామపంచాయతీలోని చెన్నారెడ్డి ఎస్టీ కాలనీ సందర్శించి కనీస వసతులపై ఆరా తీశారు. వేపంజేరి పంచాయతీ కార్యదర్శి భావన, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో అంగన్వాడీ వర్కర్ మృతి

ప్రజాశక్తి- కార్వేటినగరం: గుండెపోటుతో అంగన్వాడీ వర్కర్ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని కార్వేటినగరం పెద్ద దళితవాడలో మంగళవారం చోటు చేసుకుంది. కార్వేటినగరం పెద్ద దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న చిన్నకుట్టి (52)కి ఉదయం ఆకస్మాత్తుగా గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే లోపే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఐసిడిఎస్ సిడిపివో పద్మసునంద, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

అంగన్వాడీ వర్కర్ చిన్నకుట్టి (ఫైల్‌ఫోటో)

బెల్ట్ షాపులపై దాడులు

ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని మద్యం దుకాణాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళారం మండలంలోని కొండకిందపల్లి గ్రామంలో నరసింహారెడ్డి, మల్లికార్జునలు అక్రమంగా మద్యం అమ్ముతున్నారని అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులకు నిర్వహించినట్లు తెలిపారు. వారిని అక్రమం 37 మద్యం సీసాలు, 51 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : కారును తప్పించబోయి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కరుణాకర్ రెడ్డి, అతని భార్య సుధా పలమనేరు వైపు వెళ్తున్న సమయంలో పలమనేరు- కుప్పం జాతీయ రహదారిలోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఆగి ఉన్న కారును తప్పించబోయిన వీకోట మండలానికి పళ్ళ గ్రామానికి చెందిన వెంకట్ రమణాచారి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కరుణాకర్ రెడ్డి, అతని భార్య సుధాకు బలమైన గాయాలు కావడంతో వీరిని పలమనేరు వికేర్ ఆసుపత్రికి తరలించారు. అలాగే తీవ్రంగా గాయపడిన వెంకట రమణాచారిని మెరుగైన చికిత్స నిమిత్తం కుప్పం పిఈఎస్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం న్యూస్

నాటు బాంబులు స్వాధీనం- వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- గుడిపాల: నాటు బాంబులు స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు గుడిపాల ఎస్సై రామ్మోహన్ మంగళవారం మీడియాకు తెలిపారు. ఎస్సై కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బసవాపల్లి పంచాయతీ రెట్టగుంట గ్రామానికి చెందిన వేలు తన ఇంటి వద్ద నాటు బాంబులు ఉన్నాయని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ తన బృందంతో కలిసి హుటా హుటిన ఇంటిని తనిఖీ చేయక ఇంటి మిద్దె పైన 7బాంబులను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ముద్దాయి వేలును విచారించగా కాట్పాడి కరసమంగం గ్రామంలోని గుర్తుతెలియని యానాదుల వద్ద నుండి నల్లమందు, గన్ పౌడర్‌ను కొనుగోలు చేసి తన ఇంటి వద్ద నాటు బాంబులు తయారు చేసి అడవి జంతువులకు పెడుతున్నానని, అవి చనిపోతే వాటి మాంసాన్ని అమ్ముకుంటానని తెలపడంతో వేలును అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై తెలిపారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని, సమాచారం తెలిపిన వారి విషయాన్ని గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- వెదురుకుప్పం: పెనుమూరు మండలం గుడ్యానంపల్లె గ్రామానికి చెందిన రవి ఆచారి రెండవ కుమారుడు మోహనాచారి (36)కి పాకాల మండలం గాదంకి గ్రామానికి చెందిన సరితతో 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే గత కొంతకాలంగా సరిత గుంటిపల్లి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగితో వివాహేతర సంబంధనం ఉందని భర్త అనుమానంతో రెండు నెలలుగా గొడవ పడుతున్నారు. అయినా భార్య ప్రవర్తనలో మార్పు రాకపోవడం, అతనితోనే ఉంటానని తెగేసి చెప్పడంతో మనస్థాపానికి గురైన తన చావుకి కారణం భార్య సరిత, ప్రభుత్వ ఉద్యోగి అని వీరిపై కఠిన చర్య తీసుకోవాలని కోరుతూ వీడియోను గ్రామస్తులకు పంపించాడు. గ్రామస్తులు మోహనాచారి కోసం చుట్టుపక్కల వెతకడంతో ఓ ప్రైవేటు క్వారీ నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మోహనాచారిని చిత్తూరు ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. అయితే అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనపై విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

డంక్ అండ్ డ్రైవ్ కేసులో

రూ.1,80,000లు జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి రూ.10,000 చొప్పున రూ.1,80,000లు జరిమానా విధించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు సోమవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 18 మందిని అదుపులోకి తీసుకుని వారిని మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో ప్రవేశపెట్టారు. జడ్జి ఉమాదేవి వాహనదారులకు 18 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం రూ.1,80,000లు జరిమానా విధించారు. ఈ 11 నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 650 మందికి సుమారు 65.1 లక్షల రూపాయల ఫైన్ విధించడం జరిగిదని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లాలోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో

స్వీట్ స్టాల్ దగ్ధం

రూ.5లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి- పుంగనూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో స్వీట్ స్టాల్‌లో అర్ధరాత్రి మంటలు చెలరేగి ఐదు లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్నిమాపక శాఖ అధికారి సుబ్బరాజు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుంగనూరు అగ్నిమాపక కేంద్ర పరిధిలో భగత్ సింగ్ కాలనీ కాలనీ సమీపంలోని బైపాస్ రోడ్డు యుఎన్ఆర్ సర్కిల్ పార్థు బేకరీ, స్వీట్ స్టాల్ సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగిందని సోమవారం అర్ధరాత్రి సమాచారం వచ్చిందని, వెంటనే సిబ్బందితో ప్రమాద స్థలం వద్దకు వెళ్లి విద్యుత్తును ఆపి సెల్ఫ్ ట్యాంక్ నీటితో మంటలను పూర్తిగా అదుపు చేసి అదనంగా నీరు తెచ్చి పూర్తిగా మంటలను అదుపు చేయడం జరిగిందన్నారు. ఈ అగ్ని ప్రమాదంలో బేకరీలోని షో కేసులు, నగదు విద్యుత్ వైరింగ్ అగ్నికి ఆహుతయ్యాయని తెలిపారు.

నాటుబాంబు పేలి ఎద్దుకు గాయాలు

ప్రజాశక్తి - రామకుప్పం: వేటగాళ్లు అమర్చిన నాటు బాంబు పేలడంతో ఎద్దుకు తీవ్రగాయాలు అయ్యాయి. మంగళవారం మండలంలోని సింగసముద్రం అటవీ సమీప ప్రాంతంలో ఎద్దు మేత మేస్తుండగా నాటుబాంబు తగిలి నోరు పగిలింది. యథేచ్ఛగా వన్యప్రాణుల వేటగాళ్లు నాటు బాంబులు, మత్తు పదార్థాలు, విద్యుత్ తీగల అమర్చి వన్యప్రాణులను హతమరుస్తున్నారు. అటవీ అధికారులు వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకొని, వేటగాళ్ల ఆగడాలను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నాటు సారా స్వాధీనం- వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం తమ్మినాయునిపల్లి పంచాయతీ పగడాలవారిపల్లి సమీపంలోని చెరువు వద్ద పి చెరుకువారిపల్లి గ్రామానికి చెందిన మంచూరి ఆనందబాబు అనే యువకుడు నాటుసారా కాంచి అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు మంగళవారం ఎస్సై శివకుమార్ పోలీస్ సిబ్బంది వెళ్లి దాడి చేశారు. అతని వద్ద నుండి 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి ఆనంద బాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.